ప్రజాశక్తి

గురువారం 11 సెప్టెంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఓఎస్‌డి, ఎస్పీ, ఎమ్మెల్యే

నేడు బాపట్లకు డిసిఎం పవన్



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ గురువారం బాపట్ల పర్యటనకు రానున్నారని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్‌తో పాటు డిప్యూటీ సీఎం ఓఎస్‌డి కష్ణతేజ పరిశీలించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లాంచింగ్ ఆఫ్ గ్రేట్ గ్రీన్ వాల్, నేషనల్ ఫారెస్ట్ మార్టిస్ట్ డే సందర్భంగా బాపట్ల సూర్య లంక, నగర వనంలో పర్యటించ నున్నారు. ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర గహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్ధసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు, అధికారులు ఈ పర్యటనలో

▶ 2లో

పేద విద్యార్థులకు అందని ప్రైవేటు విద్య



- చట్టం అమలు అంతంత మాత్రమే..
- జిల్లాలో 282 మందికే కేటాయింపు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆర్థిక స్తోమత లేక తల్లిదండ్రులు తమ పిల్లలను బాల కార్మికులుగా పలు రకాల పనుల్లో పెడుతున్నారు. దీంతో బడికి వెళ్లాల్సిన పిల్లలు బడి బయట ఉండిపోవడం జరుగుతోంది. ఈ క్రమంలో బాలల విద్యా హక్కు చట్టం-2009, దేశవ్యాప్తంగా 2010 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చింది. జాతి, మత, కులాలకు అతీతంగా దేశంలోని బాలలందరినీ బడిలోకి చేర్పించి నాణ్యమైన విద్యను చట్టం ద్వారా అందిస్తామన్నారు. కానీ ఇప్పటికీ చట్టం తెచ్చిన ప్రధాన ఉద్దేశం నెరవేరలేదు. బడి ముఖం చూడని పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఉద్దేశించిన పథకం సమగ్ర శిక్షా అభియాన్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందుకూ కొరగానిదిగా అయింది. విద్యా హక్కు చట్టం ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రవేట్ పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు 5 శాతం, ఎస్‌సి బాలలకు 10 శాతం, గిరిజన బాలలకు 4 శాతం, వెనుకబడిన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలి.

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కోసం నాలుగు విడతలుగా నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లా నుంచి పేద విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి సుమారు 5 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. తొలి విడతలో 243 సీట్లు కేటాయించగా 169 మంది మాత్రమే చేరారు. రెండో విడత 68 సీట్లు కేటాయించగా 42 మంది మాత్రమే పాఠశాలల్లో చేరారు. మూడో విడత ఒక్కరు కూడా చేరలేదు. నాలుగో విడత 130 సీట్లు కేటాయించగా 70 మంది మాత్రమే చేరారు. మొత్తంగా జిల్లాలో ఒకటో తరగతి ప్రవేశాలకు సంబందించి 3,500 మంది విద్యార్థులకు అవకాశం ఉండగా 282 మంది మాత్రమే చేరారు. లాటరీ ద్వారా సీట్లు కేటాయించడం జరిగింది. కానీ పలు కారణాలతో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులను చేర్చుకోలేదు. దీంతో పాటు

▶ 2లో

మూడోసారి మునిగిన పొలాలు

వరి రైతులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వర్షాలకు నిరంతరం లోతట్టు ప్రాంతాలు మునిగిపోతూనే ఉన్నాయి. భట్టిప్రోలు మండలం, అద్దేపల్లి, భట్టిప్రోలు గ్రామాల పరిధిలో ఏడాది బాడవ పొలాలు మూడు విడతలకు ముంపునకు గురయ్యాయి. మూడు రోజుల క్రితం కురిసిన అకాల భారీ వర్షానికి మూడో సారీ మునిగిపోవడంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. రెండు సార్లు మునిగినప్పటికీ నారు అందుబాటులో ఉండటంతో రెండు విడతలు నాట్లు వేశారు. అంతటితో వర్షం ఆగిపోతుందని రైతులు భావించారు. మూడో విడత కూడా కురిసిన వర్షానికి మునిగిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో మారు నాట్లు వేయటానికి కూడా వరి నారు అందుబాటులో లేకపోవడంతో కంటి ముందే సాగు చేసిన పంట దెబ్బతిని పొలాన్ని వదిలివేయడానికి అనేక మంది సిద్ధపడ్డారు. ఇప్పటికే రెండు విడుతలుగా వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేశామని, మరో మారు నారు లేకపోగా అప్పులు చేసి మరీ సాగు చేయడానికి రైతులు సాహసం చేయలేకపోతున్నాను. ఒకవేళ ఏదో ఒక

▶ 2లో



నీట మునిగిన బాడవ పొలం

జ్వరమొచ్చింది..



- జిల్లా అంతటా జనాన్ని పీడిస్తోన్న సీజనల్ వ్యాధులు
- ఫీవర్ సర్వేలోనే లక్ష మందికి పైగా జ్వరాలున్నట్లు గుర్తింపు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జ్వరాలు.. జలుబు.. ఇప్పుడు ఎవరిని కదిలించినా ఇదే సమస్య. సీజనల్ వ్యాధులు, వర్షాకాలంలో సహజంగా వాతావరణంలో మార్పులు పారిశుధ్య లోపం కారణంగా ఏటా వచ్చేవే.. ఇప్పుడు ఇవి తీవ్రంగా జనాన్ని వేధిస్తున్నాయి. చిన్నాపెద్ద అనే తేడా లేదు. పిల్లల్లోనూ ఎక్కువగా ఉన్నాయి. విష జ్వరాల వల్ల శరీరం విపరీతమైన నొప్పులు వస్తున్నాయి. జలుబు ఉన్న వారిలోనూ ఇదే సమస్య. జనాన్ని వేధిస్తున్నాయి. సాధా రణ పనులకూ ఆటంకంగా మారాయి. జ్వరం తగిలిందంటే వారం రోజులు తిరగలేకపోతున్నారు. ఆసుపత్రులూ జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ భయం కూడా ఉన్నందున జనం ఇప్పుడు దేన్నీ నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ రోజులు జ్వరం ఉంటే రక్త పరీక్షలూ తప్పడం లేదు. మళ్లీ డెంగీ వంటి ఇతర జ్వరాలకు దారితీస్తే ప్రమాదమని ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు ఉన్నాయి. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. అక్కడక్కడా వర్షాలు

▶ 2లో

మూడోసారీ మునిగిన పొలాలు

(మొదటిపేజీ తరువాయి)

రూపంలో చెరుకుపల్లి, కావూరు, రాంబోట్లవానీ పాలెం, వంటి ప్రాంతాలలో నారు అందుబాటులో ఉన్నప్పటికీ సెంటు రెండు నుండి మూడు వేల రూపాయలు ధర పలుకుతుండటంతో మరోసారి అప్పులు చేసే సాగు చేయలేమని రైతులు వాపోతున్నారు. కాలువల పూడికతీత చేపట్టక పోవడంతోనే ఇలాంటి దుస్థితి ఏర్పడుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేద విద్యార్థులకు అందని ప్రైవేటు విద్య

(మొదటిపేజీ తరువాయి)

ఫీజు వరకు ప్రభుత్వం చెల్లించినా పుస్తకాలు, యూనిఫారం, టీ షర్టులు పేరుతో ఒక్కొక్క విద్యార్థికి సుమారు రూ.10 వేల నుంచి 30 వేల వరకు ప్రైవేటు, కార్పోరేట్ స్కూల యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఇదంతా పేద విద్యార్థుల తల్లిదండ్రులకు భారమే. పాఠశాలల్లో చేరిన విద్యార్థులను అదనపు ఫీజు కోసం వేధించే ప్రైవేటు యాజమాన్యాలు ఉన్నాయి. చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఎంత మంది పిల్లలకు సీట్లు కేటాయించారు. ప్రస్తుతం ఎంతమంది చదువుతున్నారనే దానిపై పరిశీలిస్తే వాస్తవాలు విస్తుపోయేలా ఉంటాయి. ఇలా పలురకాల కారణాలతో సీట్లు కేటాయించినా పేద వర్గాల పిల్లలకు కార్పోరేట్ విద్య అందని ద్రాక్ష అయ్యింది.

నేడు బాపట్లకు డిసిఎం పవన్

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలంలోని నగరవనంలో ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. తాటి మొక్కలను సంరక్షించాలనే సదుద్దేశంతో నగరవనానికి వచ్చే మార్గంలో పవన్ కళ్యాణ్ తాటి మొక్కను నాటనున్నారు. అనంతరం నగరవనంలో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అటవీ సిబ్బందికి నివాళులర్పిస్తారు. అమరవీరుల కుటుంబ సభ్యులతోనూ ఆయన సమావేశమవుతారు. పరిశీలనా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్‌గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది..

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నాయి. వాతావరణంలో వైరస్‌లు ఎక్కువగానే ఉంటున్నాయి. మరోవైపు వర్షాలకు తాగునీటి వనరులు కలుషితం కావడం సహజం. చెరువులు, స్టోరేజీ ట్యాంకుల్లో వర్షపునీరు కలిసింది. దీన్నే తాగునీటి పథకాల ద్వారా అందిస్తున్నారు. పిల్టరు పాయింట్లు ఎక్కడా సమర్థవంతంగా పనిచేయడం లేదు. సాగర్ జలాలు ఎలా ఉన్నా తాగడానికి జనం ఆసక్తి చూపు తారు. వాటి కోసమే ఎదురుచూస్తారు. ఒంగోలులో సాగర్ నీరు ఇస్తే తప్ప మరో నీరు లేదు. అన్నిచోట్లా తాగునీటి పథకాలకు సంబంధించిన స్టోరేజీ ట్యాంకుల్లో వర్షపు నీళ్లు కలిశాయి. నీటి రంగు, రుచి కూడా మారింది. ఇక పారిశుద్యం కూడా అధ్వానంగానే ఉంది. పంచాయతీల్లో నిధుల్లేక ఎక్కడా సరైన చర్యలు లేవు. పట్టణాల్లోనూ పారిశుధ్య కార్మికులు ఉన్నందున కొంత పరిస్థితి మెరుగ్గా ఉంది. చెత్త టన్నుల కొద్ది వస్తోంది. దీని వల్ల కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వాతావరణం, పరిసరాలు బాగాలేకపోవడంతో దోమల తీవ్రత పెరిగి వ్యాధులు విజృంభిస్తాయి. ముందస్తు చర్యలు తక్కువగానే ఉన్నాయి. తాజాగా వైద్యశాఖ నిర్వహించిన సీజనల్ ఫీవర్ సర్వేలోనూ జిల్లాలో లక్ష మందికిపైగా జ్వర పీడితులున్నట్లు గుర్తించారు. మండలానికి నాలుగు వేల నుంచి 9 వేల మంది వరకూ జ్వరాల బారిన పడ్డట్లు తేలింది. అనధికారికంగా ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. ఏదేమైనా సీజనల్ వ్యాధులు జనాన్ని వేధిస్తున్నాయి.

కార్ల స్టాండ్‌కు స్థలం కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కార్ల స్టాండ్‌కు స్థలం కేటాయించాలని జై డ్రైవరన్న అసోసియేషన్ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట మాచర్ల, మార్కాపురం జాతీయ రహదారిపై వాహనాలు అడ్డం పెట్టి డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులను చెదరకొట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ మాట్లాడుతూ యర్రగొండపాలెంలో డ్రైవర్ వృత్తిని నమ్ముకొని సుమారు 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. కార్ల స్టాండ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రాళ్ళవాగు అనుకోని ఉన్న ఖాళీ స్థలాన్ని బాగుచేసుకుంటుంటే కొంత మంది వ్యక్తులు తమ పట్టాలు ఉన్నాయని అడ్డు పడుతున్నారని తెలిపారు. ఈ విషయం గురించి తహశీల్దారు మంజునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లితే ఆ స్థలం తన పరిధిలో లేదని, ఇరిగేషన్ పరిధిలో ఉందని చెప్పారన్నారు. ఈ విషయంపై అధికారులు



ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు

స్పందించి తమకు జీవనాధారంగా ఉన్న కార్ల స్టాండ్‌కు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శేషు, డ్రైవర్లు ఉస్మాన్, చెన్నారెడ్డి, మధు, రవుఫ్, రవి చంద్రారెడ్డి, అఖిల్, మబుబాషా, బాబు, అశోక్ రెడ్డి, బాజి తదితరులు పాల్గొన్నారు.

వలీసాహెబ్ మృతి తీరని లోటు

ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు పల్లెపోగు జాషువా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏరియా గ్రామీణ వైద్యులకు అండగా ఉంటూ వారి సమస్యలను ముందు ఉండి పరిష్కరించే ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ షేక్ వలీ సాహెబ్ మతి తీరని లోటని ఆ సంఘం అధ్యక్షుడు పల్లెపోగు జాషువా తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి బంగ్లాలో వలీ సాహెబ్ సంతాప సభ బుధవారం నిర్వహించారు. తొలుత వలీసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ సభ్యులు మాట్లాడుతూ ఏరియా గ్రామీణ సంఘం ఏర్పాటుకు, గ్రామీణ వైద్యుల సంక్షేమం కోసం వలీసాహెబ్ ఎనలేని కషి చేశారన్నారు. యూనియన్‌లో ఎవరికి ఏ ఇబ్బందులు వచ్చిన వారి సమస్యలను తన సమస్యగా భావించి, ఎంత వారికైనా వెళ్లి సమస్యకు పరిష్కారం చూపేవారని తెలిపారు. అలాంటి వ్యక్తి తమ మధ్య లేకపోవడం బాధాకరన్నారు. ఈ కార్యక్రమంలో ఆ



వలీసాహెబ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంఘం ప్రధాన కార్యదర్శి తోంట్ల మస్తాన్‌రెడ్డి, ట్రెజరరీ పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, ప్రచార కార్యదర్శి టంగుటూరి సత్యనారాయణ, బట్టపోతుల వెంకటేశ్వర్లు, శాంసన్, బాలకోటి, జి.శ్రీనివాసరావు, కోటి, లక్ష్మయ్య, పలువురు గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికురాలిని తొలగించొద్దని నిరసన

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం ఉయ్యాల వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు ఎస్‌కె.శాబిర అక్రమ తొల గింపును ఆపాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య కోరారు. పేరెంట్స్‌తో మీటింగ్ జరుపకుండానే శాబిరను విధుల నుంచి తొలగించే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ శాబిరను రాజకీయ కారణాలతో తీసేయాలనే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానో పాధ్యా యుడు విద్యార్థుల తల్లి దండ్రులకు నోటీసులు ఇవ్వలేదన్నారు. విద్యార్థుల తలి దండ్రులు కాని వారితో సంతకాలు పెట్టించడం దారుణమని ఆరోపించారు. పేరెంట్స్ కాని వాళ్ళు ఇద్దరు పేరెంట్స మీటింగుకు రాగా స్కూల్ శానిటేషన్ వర్కర్ సాబిర వారిని అడ్డుకొని వెనక్కి పంపినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి -కంభం రూరల్

స్థానిక బోర్డు స్కూల్‌లోని భవిత కేంద్రంలో ఎంఇఒలు అబ్దుల్ సత్తార్,శ్రీనివాసులు చేతుల మీదుగా వికలాంగ విద్యార్థులకు సీపీ చైర్లు,వీల్ చైర్లు ఇతర ఉపకరణాలు బుధవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు,స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు నూర్జహాన్, హెచ్ఎం వి.వెంకటేశ్వర్లు, ఐఇఆర్‌పిలు అరుణ్ కుమార్, ఈశ్వరి, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రైతులు ఖరీఫ్ సీజ్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారి జవహార్ లాల్ తెలిపారు. మండలంలోని కటకానిపల్లి, రామచంద్రకోట గ్రామాల్లో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. తొలుత క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నల్ల బర్లీ పొగాకు సాగు చేయొద్దని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో విఎఎ రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

డికె భూములపై పెద్దల కన్ను

ఇసుక తవ్వేందుకు సన్నాహాలు..

ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలకు బేరం

పొలాలకు ముప్పు తప్పదని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-మద్దిపాడు

ఆ భూములలో ఉన్న ఇసుకపై పెద్దల కన్ను పడింది. అందుకు జెసిబిలను రంగంలో దించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. డికె భూములు కావడంతో పట్టా ఉన్న రైతులతో మంతనాలు జరుపుతున్నారు. ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలకు బేరం కుదిరినట్లు సమాచారం. కొంతమంది అంగీకరించగా ఎక్కువ శాతం మంది ఇసుక తవ్వకాలకు ఒప్పుకోవడం లేదు. ఇసుక తవ్వకాలు జరిగితే మా పొలాలు కోతకు గురవుతాయని పక్క పొలాలు రైతులు అంటుండగా వరదలు వస్తే అసలు మా కాలనీ ఉండదని ఎంబిసి నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు...

మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో అప్పట్లో ఎస్సీలకు 39 ఎకరాల వరకు డికె పట్టా భూములను ఇచ్చినట్లు సమాచారం. ఆ భూములలో ఉన్న ఇసుకను తరలించి సొమ్ము చేసుకునేందుకు పెద్దల కన్ను పడింది. ఇక వెనువెంటనే ఆ భూములు ఎవరి పేరు మీద ఉన్నాయో తెలుసుకుని వారిని ఒప్పించే పనిలో నిమగ్నమయ్యారు. అందుకు పట్టా ఉన్న ఒక్కోక్క రైతుకు రూ.2.5 లక్షలకు బేరం కుదిరినట్లు సమాచారం. అందులోనూ కొంత మంది ఒప్పుకోగా ఎక్కువ శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట ఆ భూములలో ఇసుకను తవ్వేందుకు జెసిబి వెళ్లగా దానిని ఎంబిసి నగర్ కాలనీవాసులు అడ్డుకున్నారు. ఇసుకను యంత్రాల సాయంతో తవ్వితే పెద్ద ఎత్తున గోతులు పడతాయని, ఆ పక్కనే ఉన్న పొలాలు కోతకు గురయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. వరదలు వచ్చే సందర్భంలో నీరు మా కాలనీలోకి ప్రవేశిస్తాయని అసలు మా కాలనీ ఉండదని ఎంబిసి నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఆ గ్రామానికి చెందిన కొంత మంది గుండ్లకమ్మలో ఉన్న ఇసుకను మనుషుల సాయంతో ఎత్తించి బయటకు తరలిస్తున్నారు. అలాంటిది జెసిబిలను ఆ భూములలో దించితే పది అడుగుల లోతు అన్నది 20 అడుగుల కంటే ఎక్కువ తీసే అవకాశముందని అసలు నిబంధనలు పాటించరని దీని వలన భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం సంభవించొచ్చని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇసుకను తరలించేందుకు మద్దిరాలపాడు బ్రిడ్జి కింద నుంచి గుండ్లకమ్మలోకి రోడ్డు వేస్తున్నట్లు సమాచారం. ఈ తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు భారీగా ముడుపులు ఇస్తామని చెప్పడంతో పెద్దలకు వారి పూర్తి సహకారం ఉన్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



గుండ్లకమ్మ నది ఒడ్డున డికె భూముల్లో ఇసుక

'ఏచూరి' ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్


ప్రజాశక్తి-పామూరు

సిపిఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి వర్ధంతి సభ పప్పు వెంకోబ్ రావు మీటింగ్ హాల్లో సయ్యద్ గౌస్ బాషా అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు షేక్ అల్లాభక్ష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. కుల మతాలను రెచ్చగొట్టేందుకు బిజెపి కుట్ర చేస్తుందన్నారు. భారతదేశంలో పెట్టుబడిదారుల కొమ్ము కాస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. సీతారం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో పనిచేసి అంతర్జాతీయ రాజకీయాల స్థాయికి ఎదిగిన, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమానికి కె.మాల్యాద్రి, ఊసా వెంకటేశ్వర్లు, వీరనారాయణ, శంకర్, మహాపీరా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీ, ధనలక్ష్మి, మదారమ్మ, రమీజ, కాదు ఉనీషా పాల్గొన్నారు.



పామూరులో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

హనుమంతునిపాడు : కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలోని లౌకిక శక్తులన్నిటిని ఏకతాటిపై నిలబెట్టిన ఘనత కామ్రేడ్ సీతారాం ఏచూరిదే అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశ విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం రాజ్యాంగంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి దేశంలో ఒక రాజకీయ ప్రత్యమ్నాయ మార్గాన్ని ఇచ్చిన రాజకీయ తత్వవేత్తగా కొనియాడారు. రోజురోజుకు పెరుగుతున్నటువంటి భూ దోపిడీ, శ్రమదోపిడి, కార్మిక వర్గ దోపిడీ, సామాజిక వర్గ దోపిడీలకు వ్యతిరేకంగా దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం ఉద్యమాలు మరింత ఊపందుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. స్థానిక పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం ద్వారా మాత్రమే మనము నిజమైన విప్లవకారులుగా ప్రజలకు చేరువవుతామని తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే ఏచూరికి నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కత్తి ఏబు, సూరెడ్డి రమణారెడ్డి, అంద్రా వినయ్, గురునాథం రాములు, గూడూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమంతునిపాడులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొండపి



రామారావు (ఫైల్)

పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపి పంచాయితీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామం పొలాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన అన్నదమ్ములు బెజవాడ రామారావు, బెజవాడ రమేష్, మామిళ్లపల్లి లక్ష్మయ్య అనే ముగ్గురూ గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే ముగ్గరు కట్టావారిపాలెం గ్రామానికి పడమర ఉన్న చెరువులోకి గొర్రెలను మేపుకోవడానికి తోలుకొని పోయారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈ వర్షానికి వారు ముగ్గురు చెట్టుక్రిందకు వచ్చారు. లక్ష్మయ్య గొర్రెలు పక్కకి పోతున్నాయని వాటి వద్దకు వెళ్లాడు. ఇంతలో పిడుగు వారు ఉన్న చెట్టు పై నుంచి రామారావు మీదకు పడిటంతో రామారావు అక్కడిక్కడే మృతి చెందాడు. రమేష్ పక్కనే ఉండడంతో స్పృహతప్పి పడిపోయాడు. లక్ష్మయ్య పిడుగుదెబ్బకు కొంత దూరం ఎగిరి పడ్డాడు. స్థానికులు ట్రాక్టర్లులో వెళ్లి మృతి చెందిన రామారావును ఇంటికి తీసుకొచ్చారు. రమేష్‌ను కొండపి ప్రభుత్వ వైద్యశాలలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. లక్ష్మయ్యకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న తహశీల్దారు ఎస్.శ్రీనివాసులు, యంపిడివో రామాంజనేయులు, సెక్రటరి రాంమోహన్‌రావు, వీఆర్వో సుశీలదేవి సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన రామారావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎస్ఐ ప్రేమకుమార్ కేసు నమోదు చేశారు.

దోపిడీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దోపిడీ కేసులో నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలులోని 3వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి వి.నవ్యశ్రీ తీర్పు ఇచ్చారు. ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 03.08.2024 సాయంత్రం సమయంలో ఒంగోలు పట్టణం అంకమ్మ పాలెంలో నివసిస్తున్న పటాపంజల సుగుణమ్మ ఇంటికి నిందితుడు ఇల్లు అద్దెకు కావాలని వెళ్లి ముందు రోజు ఇంటి పరిసరాలను పరిశీలించి, మరుసటి రోజు ఇంటికి వచ్చి పదునైన ఆయుధంతో కొట్టగా ఆమె స్పృహ తప్పి కింద పడిపోయింది. ఆమె మెడలో ఉన్న ఆరున్నర సవర్ల బంగారు చైన్ లాక్కుని వెళ్లిపోయాడు. అనంతరం కొంతసేపటికి స్పృహలోకి వచ్చిన సుగుణమ్మ ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ సిఐ నాగరాజు సమగ్ర దర్యాప్తు చేసి తాళ్లూరు మండలం, శివరాంపురం గ్రామానికి చెందిన రావిపాటి జగదీష్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్టులో హాజరుపరచగా సీనియర్ ఎపిపి కె.కళావతి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. నేరం నిరూపణ కావడంతో కోర్టు నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. కేసులో ముద్దాయికి శిక్ష పడటంలో కృషిచేసిన ఒంగోలు వన్ టౌన్ సిఐ వై.నాగరాజు, సీనియర్ ఎపిపి కె.కళావతి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ డి.ప్రసాద్‌రావులను జిల్లా ఎస్పీ అభినందించారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రపంచంలో ప్రతి సంవత్సరం 8 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారని దీనికి కారణం ఒంటరితనం, డిప్రెషన్, రిలేషన్షిప్ బ్రేకప్, ఆర్థిక సమస్యలు, దీర్ఘకాలిక రోగాలు, లేదా ఆరోగ్య సమస్యలు, ఫెయిల్యూర్స్, డ్రగ్ ఇలాంటి విషయాలు అనేకం కారణం అవుతాయని రిమ్స్ హాస్పిటల్ సైక్రియాటిస్టు డాక్టర్ జి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. రిమ్స్ వైద్యశాల నుండి ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ జి.చంద్రశేఖర్ వారి బృంద సభ్యులు ఏడుకొండలు, అనిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారుకీ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకునే గుర్తించి, అడ్డుకోవాలన్నారు. అలాగే అలాంటి వారు మనకు తారాసపడినప్పుడు 14416 టోల్ నెంబర్‌కి కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 200 మందికి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివికే మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సివి సుబ్బారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, ఏవో ఎం.రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కళాశాల ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పొగాకు నాణ్యత పెంపుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కొండపి

పొగాకు రైతులు పంట నియంత్రణ పాటించి నాణ్యత పెంపుపై దృష్టి సాధించాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అన్నారు. బుధవారం కొండపి వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ ఆవశ్యకతను రైతులకు వివరించారు. మన దేశం ప్రపంచంలో ఎఫ్‌సివి పొగాకు ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని ఎగుమతిలో రెండవ స్థానంలో ఉందని తెలిపారు. ప్రపంచ దేశాలలో పొగాకు ఉత్పత్తి 3762 మిలియన్ కేజీల నుండి 4197 మిలియన్ కేజీలకు పెరిగిన కారణంగా, మరి ముఖ్యంగా బ్రెజిల్, జింబాబ్వే, చైనాలో అధిక ఉత్పత్తి వలన రైతులు పండించిన పొగాకును మంచి ధరలకు అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సంవత్సరం లోగ్రేడు పొగాకు అమ్మకాలు మందకోడిగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్, బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, పోటు మురళి బాబు, నాగినేని భాస్కర్ చౌదరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిడిపోతు యశ్వంత్

టంగుటూరు: దేశీయంగా విదేశాలలో పొగాకుకు గల గిరాకీని, నిల్వలను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించినట్లు పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ తెలిపారు. వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్యతో కలిసి టంగుటూరు పొగాకు బోర్డును బుధవారం సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతులతో సమావేశమై 2025-26 పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ మీద నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. దక్షిణ ప్రాంత నల్ల రేగడి నేలలు బ్యారెన్ ఒక్కింటికి 3565 కేజీల పంట సాగుకు అనుమతించారని తెలిపారు. కొత్తగా అనధికారికంగా బ్యారన్‌లు నిర్మించవద్దన్నారు. వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి సాగు చేసేవారు తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాస రావు, పొగాకు రైతు సంఘం నాయకులు పోతుల నరసింహ రావు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సంపద సృష్టించేది కార్మిక వర్గమే..

సిఐటియు మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్

ప్రజాశక్తి - చీరాల

సంపద సృష్టించేది కార్మిక, శ్రామిక వర్గం మాత్రమేనని, అయితే ప్రధాని మోడీ పెట్టుబడుతారులే సంపద సృష్టిస్తున్నారని చెప్పటం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు పట్టణ తృతీయ మహాసభ బుధవారం నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఐవి ప్రసాదరావు సిఐటియు జెండా ఆవిష్కరించి సభలను ప్రారంభించారు. ఈ సభకు ఎన్ బాబురావు, ఎం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. పి కాలేషా సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల లాభాల కోసం పన్నులు తగ్గించడం, బ్యాంకు రుణాలు రద్దు చేయడం జరుగుతుంటే, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని అడిగితే బడ్జెట్ లోటు కారణం చెబుతున్నారని మండిపడ్డారు. కోటీశ్వరులను శతకోటీశ్వర్లుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలని అన్నారు. మరోవైపు నిరుద్యోగం భారీగా పెరుగుతుండగా ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా ప్రైవేటుదారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ప్రజలు పోరాడి సాధించుకున్న ఆస్తిని ప్రైవేటీకరణ చేస్తుంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కేంద్రం ప్రైవేటీకరణ చేస్తుంటే చూసే పరిస్థితిలో ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో స్కీం వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, అసంఘటిత కార్మికుల సమస్యలపై, ప్రైవేటీకరణ విధానాలపై, లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని చెప్పారు. ఎం వసంతరావు సిఐటియు పట్టణ కన్వీనర్‌గా 25మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జి సుధాకర్, పి ప్రమీల, వీరాస్వామి, శీలమ్మ, ఝాన్సీ, పి కాలేషా పాల్గొన్నారు.


వెంకటరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వాసంశెట్టి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - చీరాల

ఐఎల్టీడీ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర మాజీ అధ్యక్షులు వాసంశెట్టి వెంకటరావు చిరస్మరణీయులని, కార్మికుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గోసాల సుధాకర్ అన్నారు. స్థానిక చీరాల ఐఎల్టీడీ యూనియన్ కార్యాలయంలో వాసంశెట్టి వెంకటరావు మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వాసంశెట్టి వెంకటరావు సుమారు 40ఏళ్లుగా యూనియన్ నాయకునిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో కృషి చేశారని అన్నారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తూ కార్మిక హక్కుల సాధనకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ బ్రాంచ్ అధ్యక్షులు బోయిన పోతురాజు, కార్యదర్శి కుందుర్తి నీలాంభ్రం, నాయకులు నక్కల నాగరాజు, పఠాన్ కాలేషా, పెరుగు తిరుమలరావు, కె ఏసురత్నం పాల్గొన్నారు.


వీర జవాను చిత్రపటానికి నివాళి

'పరమ వీరచక్ర' హమీద్‌కు నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

భారత్, పాకిస్తాన్ మధ్య 1965లో జరిగిన యుద్ధంలో ఎంతో సమయస్ఫూర్తితో పాకిస్తాన్‌కు చెందిన 8యుద్ధ ట్యాంకులను పేల్చి శత్రుమూకల తుపాకీ గుళ్లకు బలైన వీరమరణం పొందిన పరమ వీరచక్ర బిరుదాంకితుడు, అమర సైనికుడు అబ్దుల్ హమీద్ అని గుంటూరు డివిజన్ రైల్వే బోర్డు సభ్యులు పి రాజేష్ అన్నారు. అబ్దుల్ హమీద్ 60వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. పాకిస్తాన్ యుద్ధంలో ఆయన చూపిన పోరాట పటిమ భారత సైనికుల పరాక్రమ గాథగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె కొండలు, జి కొండలు, నర్రా కొండలు, గేరా చార్లెస్, డి రాము, మోహన్, దయారావు, నక్కా ప్రకాష్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మహేంద్రా నాథ్

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చీరాల

పర్యాటక రంగ అభివృద్ధికి ఎమ్మెల్యే కొండయ్య అహర్నిశలు కృషి చేస్తున్నారని, దూర ప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులకు కావలసిన మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులను సమన్వయం చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి ఎం మహేందర్ నాథ్ అన్నారు. మండలంలోని వాడరేవు, రామాపురం సముద్ర తీరంలో ఆయన బుధవారం పర్యటించారు. చీరాల, వాడరేవు, రామాపురం బీచ్‌లో పర్యాటకుల కోసం నూతన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ టాయిలెట్, వెయిటింగ్ హాల్స్, నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..


పిడి ఆనంద్ సత్యపాల్‌ను సత్కరిస్తున్న మెప్మా కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం మహిళ అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని, డ్వాక్రా రుణాల ద్వారా మహిళలను ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చేస్తుందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి ఆనంద్ సత్యపాల్ అన్నారు. నూతనంగా నియమితులైన ఆయన స్థానిక మెప్మా కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్ లక్ష్యాలపై సమగ్ర సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనోపాధుల పెంపుదలకు సంబంధించిన 220 మంది ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. కొత్త యూనిట్లు ఏర్పాటు చేయించి, సుస్థిరమైన జీవనోపాధులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు డిజిటల్ సేవలు చేరువయ్యేలా చేయాలని సూచించారు. సూర్యఘర్ పథకం ప్రయోజనాలు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళా సంఘ సభ్యులకు ర్యాపిడో ఆటోలు, బైకులు రుణాల రూపంలో అందజేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో సిఎంఎం కొండయ్య, సిఓలు రత్నకుమారి, సుబ్బారావు, శేషరత్నం, సతీష్, డిఈఓ అనిల్ కుమార్, ఆర్పీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీకాంత్

ప్రజాశక్తి - బాపట్ల

శరవేగంతో పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ టి శ్రీకాంత్ అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ (సైబర్ సెక్యూరిటీ), ఎఐఎంఎల్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ అవేర్నెస్ కెరీర్ గైడెన్స్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత సమాచారం రహస్యంగా ఉంచుకోవడం, పాస్‌వర్డ్ సెక్యూరిటీ, ఫిషింగ్, మాల్వేర్, హ్యాకింగ్ దాడుల వంటి సైబర్ మోసాలు గుర్తించే విధానాలు, వాటి నుండి రక్షించుకునే మార్గాలు వివరించారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో పెరుగుతున్న కెరీర్ అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, సర్టిఫికేషన్లు, ప్రాజెక్ట్ వర్క్ ప్రాముఖ్యత, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమకు తాము తీర్చిదిద్దుకునే దిశగా కృషి జరగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ రామాదేవి, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి ప్రొఫెసర్ వి చక్రధర్, ఎఐఎంఎల్ విభాగాధిపతి కె మనీదీప్, కె సుందీప్ సారథి, జె కుమార్ రాజా పాల్గొన్నారు.

ఎపిడిగా సింగయ్యకు ఉద్యోగోన్నతి


సింగయ్యను సత్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - అద్దంకి

ఎంపిడిఓ బి సింగయ్య పదోన్నతిపై డ్వామా ఎపిడిగా బదిలీపై వెళ్తుండటంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నేతలు, కుంకుపాడు సర్పంచ్ గాలం శ్రీను, ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బ్రహ్మానందం, జ్యోతి రామారావు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. మండలంలో ఆయన సేవలను ప్రశంసించారు.



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఆటో కార్మికులను ఆదుకోవాలని మేదరమెట్ల ఆటో యూనియన్ కార్మికులు కోరిసపాడు తహశీల్దారు మెహతాజ్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆటోలకు ఏ ప్రయాణికులు ఎక్కడం లేదని అన్నారు. దీంతో తమ జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. కిస్తీలు, ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఆటో కార్మికులను ఆదుకోవడానికి సంవత్సరానికి రూ.20వేలు ఇవ్వాలని, లేకుంటే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం బాధ్యులు నాతాని హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులు ఎం ఆంజనేయులు, వై రవీంద్రబాబు, ఆటో కార్మికులు ఎన్ రామదాస్, శ్రీధర్, వీరాంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పిఎల్‌వి నరసింహారావు

నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హర్షిని డిగ్రీ కాలేజ్ నందు 20 మంది విద్యార్థులతో రొటరాక్ట్ క్లబ్ ఏర్పాటు చేశారు. రోట్రాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తస్నీరు రాకేష్, సెక్రటరీ తిరునగరు హేమంత్‌ను నియమించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ పోపూరి లక్ష్మీ వెంకటనరసింహారావు, రోటరీ ప్రెసిడెంట్ శివధర పూర్ణచంద్రరావు మాట్లాడారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు వివరించారు. రోట్రాక్ట్ కూడా రోటరీ క్లబ్‌తో కలిసి సేవలు నిర్వహించాల్సి ఉందని అన్నారు. రోట్రాక్ట్ క్లబ్ ఆవశ్యకత గుర్తించి రోటరీ క్లబ్‌లో చేరటానికి ఇది ఒక మెట్టు లాంటిదని తెలిపారు. రోట్రాక్ట్ క్లబ్ ఏర్పాటు నిధుల ఖర్చుతో కూడిన దైనప్పటికీ దాని ఆవశ్యత గుర్తించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




ఉల్లిపాయల నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ ఆర్.గోపాలకృష్ణ

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి చర్యలు

జేసీ ఆర్.గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలో రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయల నాణ్యతను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఒంగోలు నగరంలోని రైతు బజార్లను జెసి బుధవారం తనిఖీ చేశారు. రైతులు, వినియోగదారులను కూరగాయల ధరలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్లలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.వరలక్ష్మి, డిఈఈ టి.పవన్‌కుమార్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఎరువుల దుకాణాలలో ఆర్డీవో తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని పలు ఎరువుల దుకాణాలలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి.. యూరియా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గద్దలగుంటలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను, ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులను ఆర్డీవో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు తహశీల్దార్ మధుసూదనరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో

ఏపీకి అగ్రస్థానమే లక్ష్యం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దేశంలో పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించే రాష్ట్రాల వారీ సర్వేల్లో ఆంధ్రప్రదేశ్ గత నాలుగేళ్ళుగా మొదటి స్థానంలో నిలుస్తోందని, 2024 ర్యాంకింగ్స్‌లో కూడా అదే స్థానం దక్కేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 16 శాఖలకు చెందిన 2374 మందికి శిక్షణ ఇవ్వబడిందని, ఎస్‌డిపి పోర్టల్ ద్వారా అనుమతులు సులభతరం చేశామని వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

డ్వామా ఏపీడీలుగా శింగయ్య, శివనారాయణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్‌ను కలిసిన శింగయ్య, శివనారాయణ

బాపట్ల జిల్లా డ్వామా సహాయ పథక సంచాలకులుగా బి. శింగయ్య, శివనారాయణ బుధవారం విధులలో చేరారు. బి శింగయ్య గతంలో అద్దంకి యంపీడీఓగా పనిచేస్తూ డివిజనల్ డెవలప్ మెంట్ అధికారిగా ప్రమోషన్ పై ఎపిడి, డ్వామా, చీరాల పోస్ట్ లోనూ, శివనారాయణ చీరాల యంపీడీఓగా పని చేస్తూ ప్రమోషన్ పై బాపట్ల ఎపిడిగానూ విధులలో చేరారు. కలెక్టర్ జె వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

రాప్తాడుకు ఆర్టీసీ బస్సులు..

బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

కూటమి ప్రభుత్వం అనంతపురం సూపర్ సిక్స్ విజయోత్సవ సభకు వందల కొద్దీ ఆర్టీసీ బస్సులు తరలించారు. దీంతో ప్రయాణికులు రెండు రోజులుగా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సుమారు 400 కిలో మీటర్ల దూరంలో జరిగే సభకు వందలాది ఆర్టీసీ బస్సులు తరలించడంతో బుధవారం ప్రయాణికులకు అగచాట్లు తప్పలేదు. జిల్లా నుంచి సుమారు 160 బస్సులు మంగళవారం నాడే అనంతపురం జిల్లా రాప్తాడు, సింగమనలకు తరలించారు. దీంతో ప్రజారవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఒంగోలు డిపోకు చెందిన మొత్తం 134 సర్వీసులకు 74 పల్లె వెలుగు బస్సులు(స్త్రీ శక్తి కి కేటాయించిన) ఉండగా సింహభాగం 38 బస్సులు సూపర్ సిక్స్ సభకు పంపారు. జిల్లాలో మిగిలిన 4 డిపోల నుంచి మరో 122 బస్సులు పంపినట్లు సమాచారం. జిల్లా పరిధిలో ముఖ్య కేంద్రాలు, గ్రామాలకు సకాలంలో బస్ సౌకర్యం లేక గంటల కొద్దీ ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు గాశారు. వివిధ పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలనుంచి జిల్లా కేంద్రం ఒంగోలు వచ్చేందుకు, ఒంగోలు నుంచి తిరిగి వారి నివాసాలకు చేరేందుకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్న సభకు ఆర్టీసీ కి ఒక్కొక్క బస్‌కు సుమారు రూ55 వేల లెక్కన రూ.88 లక్షలు రీ ఎంబర్స్‌మెంట్ రూపంలో చెల్లించాలి. కాగా నెల్లూరు ప్రకాశం గుంటూరు జోన్ నుంచే 670 బస్సులు ఈ సభలకు పంపినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని బస్సులు పంపారో అంచనా వేసుకోవచ్చు. ఆర్టీసీ బస్సులు తరలింపుపై ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావును వివరణ కోరగా డిపో పరిధిలో 134 బస్సులుకు గాను 38 పల్లెవెలుగు బస్సులు మాత్రం తరలించమన్నారు. దూరప్రాంతాలకు నిర్దేశించిన ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్ సర్వీసులు యధాతదంగా నడుపుతున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం నుంచే అన్ని సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

పాత మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను

పిపిపి పద్ధతిలో నిర్మించొద్దు..: సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని పాత మార్కెట్ స్థలంలో నగరపాలక సంస్థ నిధులతోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పిపిపి) పద్ధతిని వెంటనే రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు 0.83 ఎకరాల విస్తీర్ణంలో రెండంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నప్పటికీ, దాన్ని పిపిపి పద్ధతిలో అప్పగించేందుకు ప్రయత్నించడాన్ని తప్పుపట్టారు. వందల కోట్ల రూపాయల అత్యంత విలువ కలిగిన, నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భూములను పిపిపి పేరుతో క్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు సొంతం చేసే కుట్రలో భాగంగా ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు చేపడుతున్న తప్పుడు నిర్ణయాలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థే ఈ నిర్మాణాన్ని చేపట్టి, షాపులను అద్దెకు కేటాయించడం ద్వారా సంస్థకు స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. లీజు పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే అత్యంత విలువైన మున్సిపల్ భూములు ప్రైవేట్ వ్యక్తుల వశమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్ణయం మార్చుకుని, సాధారణ నిధులు లేదా 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఉప రాష్ట్రపతితో ఎంపీ మాగుంట

భారత 15వ ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సిపి రాధాకృష్ణన్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్ భవనంలో బుధవారం ఉప రాష్ట్రపతిని ఘనంగా సత్కరించి.. శుభాకాంక్షలు తెలియజేశారు.

స్కూల్ గేమ్స్ వార్షిక సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 69వ స్కూల్ గేమ్స్ పి.డి., పి.ఇ.టిల వార్షిక సమావేశం బుధవారం వారం సాయంత్రం పెళ్లూరులోని సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఒంగోలు డిప్యూటీ డిఇఒ చంద్రమౌళీశ్వరరావు, మార్కాపురం డిప్యూటీ డిఇఒ ఎం. శ్రీనివాసరెడ్డి, డీసీఇబి కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎస్జిఎఫ్ఐ ప్రకాశం జిల్లా సెక్రటరీలుగా ఎంపికైన డా. చక్కా వెంకటేశ్వర్లు, ఎ. శిరీష కుమారికి అభినందనలు తెలియజేశారు.

ఇజ్రాయిల్ మంత్రి భారత పర్యటనపై నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఇజ్రాయిల్‌కు చెందిన మంత్రి భారత పర్యటన చేపట్టడన్ని సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నేతత్వంలో ప్రజాసంఘాలు నిరసన తెలిపాయి. బుధవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇజ్రాయిల్ మంత్రి గో బ్యాక్ నినాదాలతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సి.ఎస్.సాగర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, పిడియస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

పార్శిల్ ప్యాకింగ్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజల సౌలభ్యం కోసం పోస్టల్ శాఖ మరో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాధిక్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం ఒంగోలు హెడ్ పోస్ట్ ఆఫీసులో పార్శిల్ ప్యాకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా

ఎరువులు పంపిణీ చేస్తాం..

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ముండ్లమూరు



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు పంపిణీ చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం ముండ్లమూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో యూరియా సరఫరా, పంపిణీపై రైతులకు అవగాహన కలిగించే ఉద్దేశంతో చేపట్టిన మెగా అవుట్ రీచ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మరియు దాని అనుబంధ రంగాల్లో ప్రతి సంవత్సరం 15 శాతం వద్ధి రేటు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్న తరుణంలో రైతులకు మంచి జరగేలా, పెట్టుబడి తగ్గించి, దిగుబడి పెంచేలా రైతులకు మంచి ఆదాయం రావాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రంలో అన్నీ ఆర్.ఎస్.కె ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. జిల్లాలో యూరియా కొరత ఉందని అపోహతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రైతులను చైతన్యపరిచే ఔట్రీచ్ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు. 9వ తేదీన జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. 10 తేదీన మండల స్థాయిలో ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రతి రైతుకు సాగు అనుభవాలు ఉన్నప్పటికినీ, మారుతున్న కాలానుగుణంగా 25 శాతం మేర ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈ ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూ సార పరీక్షల ఆధారంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు మెలుకవలు పాటిస్తూ ఎంత అవసరమో అంత ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తూ సాగు చేసినట్లయితే పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరిగి రైతుకు మంచి ఆదాయం కలుగుతుందని కలెక్టర్ వివరించారు. వరి పంట నుండి ఇతర పంటలకు ప్రాధాన్యతను ఇచ్చి పంటలను వేసుకోవాలని అన్నారు. యూరియాపై క్షేత్ర స్థాయిలో ఎలాంటి పుకార్లను నమ్మవద్దని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. జిల్లాలో యూరియా పంపిణీ, రైతుల సందేహాల నివత్తి కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు యూరియా పంపిణీకి సంబంధించిన సమాచారంతో పాటు వ్యవసాయ సంబంధిత తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి 8331057078 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చునని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ హరికష్ణ, దర్శి కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి రమేష్ తదితరులు ప్రసంగిస్తూ వ్యవసాయ సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ మేలుకవలు, సూచనలను వివరించారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్సన్, డిపిఓ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



మాట్లాడుతున్న పంగులూరు ఎఒ డి సుబ్బారెడ్డి



సంతమాగులూరులో మాట్లాడుతున్న ఎడిఎ సుదర్శనరాజు

ప్రజాశక్తి - పంగులూరు

యూరియా, రసాయన ఎరువుల వాడకం నివారించడం అవసరమని, అధికంగా వాడుటం వలన నీటి కాలుష్యానికి దోహదం చేస్తుందని ఎఒ డి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని అలవలపాడు, జాగర్లమూడి వారిపాలెం గ్రామాల్లో రైతులతో సమావేశాలు బుధవారం నిర్వహించారు. యూరియా ఎరువులు ఎక్కువ వాడటం వలన జల పర్యావరణ వ్యవస్థలను ప్రభావితం చేస్తుందని అన్నారు. నేల క్షీణత, పోషక చక్రాలలో అసమతుల్యత ఏర్పడవచ్చని, యూరియా నత్రజని అస్థిరతకు దారితీస్తుందని, ఎరువుల సామర్థ్యాన్ని తగ్గిస్తుందని అన్నారు. కంపోస్ట్ ఎరువు, జీవన ఎరువులు లేదా పచ్చి రొట్ట ఎరువు వంటి సేంద్రీయ ఎరువులను మరింత స్థిరమైన ప్రత్యామ్నాయాలుగా నానో యూరియాని వాడటం లాభదాయకమని అన్నారు. 2025- 26కు సంబంధించి బర్లి పొగాకు పంట నిషేధించినట్లు తెలిపారు. పొలాలు కౌలుకి సాగుచేవారు కౌలు కార్డులు తప్పనిసరిగా విఆర్ఒను కలిసి పొందాలని చెప్పారు. సమావేశాలలో విఎఎ చిన్నబాబు, గోపి కిరణ్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని ఎడిఎ సుదర్శన రాజు తెలిపారు. మండలంలోని గురిజేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులు వాడడం వలన నేల ఆరోగ్యం క్షీనిస్తుందన్నారు. రైతులు ఎరువుల గురించి ఆందోళన చెందవద్దని అన్నారు. అవసరమైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఒ షేక్ సైద, టెక్నికల్ ఎఒ బి ఎలమందారెడ్డి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మండలంలో వరిపైరు 40 నుండి 50 రోజుల దుబ్బు చేసే దశలో ఉందని ఎఒ ఎండి ఫారూఖ్ తెలిపారు. మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రేపల్లె : నానో ఏరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ అద్దేపల్లి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చాటగడ్డ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యూరియా అవుట్ రీచ్ ప్రోగ్రాం ఎఒ ఎ మహేష్ బాబు నిర్వహించారు. రైతుల్లోని అపోహలు తొలగించుకోవాలని తెలిపారు. అనంతరం యూరియా పంపిణీ చేస్తున్న రైతు సేవ కేంద్రాలు, పిఎసిఎస్ సొసైటీలను సందర్శించారు. కైతేపల్లిలో నానో యూరియాపై అవగాహన కల్పించారు.

అద్దంకి : అధిక రసాయన ఎరువులు వాడకం మానవాళి ఆరోగ్యానికి హానికరమని ఎడిఎ బి ఎఫ్రాయిం తెలిపారు. మండలంలోని కోటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది, యూరియా ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. తహశీల్దారు శ్రీ చరణ్, ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలంలో 120 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎ సుకన్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, కోట శివయ్య, కమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకుపల్లి ఎఒ ఎండి ఫారూఖ్



మాట్లాడుతున్న రేపల్లె ఎడిఎ లక్ష్మి



మాట్లాడుతున్న అద్దంకి ఎడిఎ బి ఎఫ్రాయిం

వారం రోజుల పాటు నిరసనలు

ప్రజాశక్తి - పంగులూరు

పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నుండి వారం రోజులు పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా హాజరు కావాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జె వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల రామారావు, జిల్లా కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తన్నీరు వెంకటరావు, షేక్ రహమతుల్లా బుధవారం కోరారు. గురువారం నుండి మండల, పాత తాలూకా, జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని కోరారు. పెండింగులో ఉన్న నాలుగు డిఎను తక్షణం విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, మేమో 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పిఆర్సి కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, ఈ హెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, యాప్‌లను అసెస్మెంట్ బుక్లెట్ విధానాలను రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. నిరసనలో భాగంగా గురువారం ప్రతి ఉపాధ్యాయుడు నల్ల బ్యాడ్జీలతో పాఠశాల విధులకు హాజరు కావాలని, ప్రతి రోజు నిరసన వారానికి సంబంధించి కార్యక్రమాలను అమలు పరచాలని కోరారు.



రైతులతో మాట్లాడుతున్న రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎరువుల పంపిణీని రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి బుధవారం పరిశీలించారు. సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులు దుకాణదారులను ఆదేశించారు. మండలంలోని గూడవల్లిలోని పిఎసిఎస్‌లో ఎరువుల నిల్వలు పరిశీలించారు. అనంతరం చెరుకుపల్లిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టరు పరిశీలించారు. రైతులందరికీ సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, టోకెన్ సిస్టం ద్వారా రైతులకు పాస్ బుక్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఎరువుల కొరత ఉందనే ప్రచారం నమ్మవద్దని చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం రైతులు అవసరం మేరకు మాత్రమే తీసుకెళ్లాలని చెప్పారు. అదనంగా కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకునే ప్రయత్నం చేయవద్దని చెప్పారు. రైతులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు వచ్చే వ్యవసాయ పద్ధతులపై దృష్టి పెట్టాలని సూచించారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎన్ గణేష్‌రెడ్డి

మైక్రోసాఫ్ట్ పవర్ బిఐపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మైక్రోసాఫ్ట్ పవర్ బిఐపై వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. బిటెక్ 2వ సంవత్సరం చదువుతున్న సిఎస్ఇండేటా సైన్స్ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ పవర్ బిఐపై వర్క్‌షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. విజయవాడ వర్క్ షాపును డెటావ్యాలి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సిఎస్ఇ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె సుబ్బారావు తెలిపారు. ఈ వర్క్ షాపుకు డెటావ్యాలి ఎన్ గణేష్‌రెడ్డి మైక్రోసాఫ్ట్ పవర్ బిఐపై విద్యార్థులకు అవగాహన కల్పించి డాష్ బోర్డ్‌లను తయారు చేయటంపై శిక్షణ ఇచ్చారు. డేటా అనలిస్ట్‌గా తమ కెరియర్‌ను ప్రారంభించి తక్కువ కాలంలోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని తెలిపారు. పవర్ బిఐపై విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు.

సిఎంను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బుధవారం సాయంత్రం అనంతపురం జిల్లా కేంద్రంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' బహిరంగ సభకు ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సిఎంను చంద్రబాబును కలిశారు.



'సూపర్ సిక్స్' సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సిఎంకు దామచర్ల అభివాదం

హెచ్ఐవి నియంత్రణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - అద్దంకి

మీ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు నిమిషాల్లో తెలుసుకునే అవకాశం, మనకు వచ్చే ఆరోగ్య సమస్యలకు వచ్చే వాటిని ఎలా ఎదుర్కోవాలి, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలు తెలుసుకోవటానికి ఎపి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కానర్ మీ ఆరోగ్య స్థితిని నిమిషాల్లో తెలుసుకోండని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా సమీకృత వ్యూహం (దిశ) ఆధ్వర్యంలో ఆగస్టు 12 నుండి అక్టోబర్ 12 వరకు 60 రోజులు పాటు విస్తృత స్థాయిలో ఉధృతంగా ఐఇసి అవగాహనలో భాగంగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ప్రభుత్వ బాలుర హైస్కూల్లో, జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఐఇసి అవగాహనకు రోజురోజుకీ హెచ్ఐవి బాధితుల సంఖ్య పెరుగుతూ ఉందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలై విచక్షణ కోల్పోయి విచ్చలవిడిగా శృంగారంలో పాల్గొనడం, కండోంమ్ వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, వ్యాధి వస్తే ఏం కాదనే నిర్లక్ష్యం కారణాలవల్ల హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధికి గురవుతున్నారని అన్నారు. వివక్షత చూపవద్దని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ యు కోటేశ్వరమ్మ, ఐసిటిసి కౌన్సిలర్ జి రమేష్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం డిఎస్ పద్మావతి, అద్దంకి హెల్ప్ అవుట్ రీచ్ వర్కర్స్ టి దుర్గాభవాని, టి లక్ష్మి, తేజస్విని, శివ పార్వతి, మల్లేశ్వరి, రమ్య పాల్గొన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలు తగ్గించడంలో కూడా మీరు వారికి తగిన వైద్య సేవలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించాల్సిన బాధ్యత ఉందని పిహెచ్‌సి ఐసిటిసి కౌన్సిలర్ జి రమేష్ పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ నాగేశ్వరావు ఎస్‌కె సత్తార్, సూపర్వైజర్ కన్యాకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెల్ప్ సంస్థ పిడి బివి సాగర్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

చీరాలకు చెందిన శ్రీ రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ విఎస్ఎన్ మూర్తి స్థానిక జెడ్‌పి గర్ల్స్ ఉన్నత పాఠశాల్లోని ఐదుగురు పేద విద్యార్థులకు, పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లోని ఐదుగురు పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందించారు. ఈనెల 20న చీరాలలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో చీరాల, వేటపాలెంలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసంకు సంబంధించి వక్తృత్వ పోటీలు, నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9866369986 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం ఉమ్మిటి వేణుగోపాలరావు, ఎవి సుబ్బారావు, జె దేవబిక్షం, జె శ్రావణి పాల్గొన్నారు.

కృష్ణా నదిలో పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంంలోని చింతల్ లంక గ్రామానికి చెందిన తోడేటి పుష్పమని ఆమె కొడుకు తోడేటి హర్షవర్ధన్ ఈనెల 7న కృష్ణానది అరవింద్ వారధి దిమ్మిపై కూర్చుని స్నేహితులతో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు జారీ నదిలో పడిపోయాడు. అతనిని వెతుకుతుండగా 9న కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పెదపాలెం వద్ద నది ఒడ్డున ఒక గుర్తు తెలియని శవం కొట్టుకుని వచ్చినదనే సమాచారం మేరకు ఫిర్యాదురాలైన తోడేటి పుష్పమని అక్కడికి వెళ్లి చూశారు. ఆ శవం తన కొడుకుదని నిర్ధారించుకుని బోరున విలపించారు. పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన పిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరకులో కాఫీ తోటల్లో విద్యార్థుల పరిశోధన

ప్రజాశక్తి - బాపట్ల

కాఫీ పంట తేయాకుపై ఆశించే హానికరమైన కాఫీ బెర్రీ బోరర్ పురుగు వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పరిశోధనకు బాపట్ల వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కూడిన బృందం అరకులో పరిశోధన చేస్తున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి తెలిపారు. కీటక శాస్త్ర విభాగాధిపతి ఎస్ఆర్ కోటేశ్వరరావు, కీటక శాస్త్ర ఆచార్యులు టి మధుమతి, పేథాలజీ విభాగ ఆచార్యులు జి వంశీకృష్ణ, ఉద్యానవన విభాగ ఆచార్యులు సిహెచ్ దుర్గాహేమంత్ కుమార్ పర్యవేక్షణలో 25మంది ఎంఎస్‌సి వ్యవసాయ విద్యార్థినీ, విద్యార్థులతో కూడిన బృందం కాఫీ పంటపై ఆశించే చీడ, పీడలను పరిశీలించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు. ఆఫ్రికాకు చెందిన ఈ చిన్న బీటిల్ పురుగు కాఫీకి అత్యంత



అరకు తేయాకు తోటల్లో వ్యవసాయ విద్యార్థులు

హానికరమైనదని అన్నారు. ఇది కాఫీ ఉత్పత్తుల నాణ్యత, దిగుబడిపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని కలగజేస్తుందని అంచనా వేస్తున్నట్లు కీటక శాస్త్ర విభాగ అధిపతి ఎస్ఆర్ కోటేశ్వరరావు తెలిపారు. కాఫీ గింజలో తన జీవిత చక్రాన్ని పూర్తి చేయగల ఏకైక కీటకమని, ఇది ప్రపంచంలో కాఫీని ఉత్పత్తి చేసే అనేక దేశాలను ఆక్రమించిందని తెలిపారు. రైతులకు దీని నివారణకు తగిన శిక్షణ లేకపోవడం కాఫీ పంటపై తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై సక్రమమైన అవగాహన లేకపోవడం వల్లే ఈ తెగులు వ్యాప్తికి కారణమని అన్నారు. తమ బృందం గత రెండు రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని బోడగూడ, చొంపగూడ, గోడగూడ, నందిగూడ, దొరగూడ, పప్పుడువలస, గాయబంద, మోరిగూడ ప్రాంతాల్లోని కాఫీ తోటల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కీటకం ద్వారా రైతులకు సంభవించే నష్టాలు గుర్తించి చర్యలను సూచించినట్లు తెలిపారు. వీరి పరిశోధనకు చొంపి గ్రామ వ్యవసాయ సహాయకుడు వి రాజమణి కుమార్ సహకరించినట్లు తెలిపారు.



డిపోను పరిశీలిస్తున్న ఎండి ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - అద్దంకి

పూర్వపు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ఆర్టీసీ డిపోలతోపాటుగా అద్దంకి డిపోను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ఎలా అమలవుతుందో పరిశీలించేందుకు వచ్చామని అన్నారు. డిపో అభివృద్ధి, బస్ స్టేషన్లో సమస్యలు తెలుసుకోవడానికి వచ్చామని అన్నారు. ప్రజలు స్త్రీశక్తి పథకంపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. పాత బస్ స్టేషన్, గతంలో నిర్మించిన రేకుల షెడ్డు కలిపి పెద్ద బస్ స్టేషన్‌గా తయారు చేయడానికి పిపిపి మోడల్‌గా మూడేళ్లలో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ లాగా ముందు వైపు వెనుక బస్టాండును అధునాతనంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 60 డిపోల్లో 100 శాతం ఓఆర్ వస్తుందని అన్నారు. కొన్ని డిపోల్లో 127 ఓఆర్ వస్తుందన్నారు. స్త్రీ శక్తి పథకం పెట్టిన తర్వాత ఆక్యుఫెన్సీ పెరిగిందని అన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇబ్బందులు లేకుండా జరుగుతుందని అన్నారు. మెకానికల్ స్టాఫ్, కండక్టర్లు, డ్రైవర్లు ఈ పథకం సక్సెస్ కావడానికి మంచిగా కృషి చేస్తున్నారని అన్నారు. వీరిని అభినందించేందుకు వచ్చామని అన్నారు.

15న మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 15న మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శివ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పిఇటి ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు నాగులపాలెం ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో 15న ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. ఒకరోజు నిర్వహించే ఈ ఆటల పోటీల్లో మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లాస్థాయి ఆటల పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగ, బ్యాట్మెంటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనేటట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ2 వెంకట్రామయ్య, ఆటల పోటీల కో ఆర్డినేటర్ ఉదయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని అనంతవరంలోని కెవివిఆర్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈనెల 12న బాల, బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎం రాఘవరెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనదలసిన వారు తాము చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ తీసుకొని రావాలని మండల కో ఆర్డినేటర్ పిడి కృష్ణరెడ్డి చెప్పారు. కోకో, కబడ్డీ, యోగా, చెస్, షటిల్, అతలెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు.

పిడిసిసి బ్యాంకులో ముమ్మర తనిఖీలు

- వైసిపి హయాంలో అవకతవకలపై విచారణ
- హాజరైన గుంటూరు ఆడిట్ శాఖ అధికారి గౌరీ శంకర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పిడిసిసిబి)లో గుంటూరు ఆడిట్ శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పిడిసిసి బ్యాంకులో చోటు చేసుకున్న అవకతలపై అధికారులు విచారణ ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బ్యాంకు ఉద్యోగుల పదోన్నతులు బదిలీలలో జరిగిన అక్రమాలు, జగనన్న పాల వెల్లువ పథకంలో జరిగిన అవకతవకలు, అనర్హులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. పిడిసిసి బ్యాంకుపై వస్తున్న పలు ఆరోపణల ఆధారంగా చేసుకుని విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, విచారణ అధికారిగా గుంటూరు ఆడిట్ శాఖ అధికారి గౌరీ శంకర్‌ను నియమించింది. దీంతో గౌరీ శంకర్ బుధవారం పిడిసిసి బ్యాంకును సందర్శించి ముమ్మ



బ్యాంకులో తనిఖీకి వచ్చిన విచారణ అధికారి గౌరీశంకర్

రంగా తనిఖీలు నిర్వహించారు. బ్యాంకులోని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిసిసి బ్యాంకుపై గతంలో వచ్చిన ఆరోపణలను లోతుగా పరిశీలించి, నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. విచారణ మరికొన్ని రోజుల పాటు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట గుంటూరు ఆడిట్ శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేటితో అవిశ్వాసానికి మూడు మాసాలు..!

- చైర్మన్ ఎన్నిక ఎప్పటికో.?
- మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ పరిస్థితి..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఏమి జరుగు తోందో అంతుబట్టడం లేదు. మున్సిపల్ కౌన్సిల్ ఉందా! లేదా!! అనేది అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో అవిశ్వాసానికి దారి తీసింది. నేటితో అవిశ్వాసం నెగ్గి మూడు మాసాలు నిండుకుంది. కొత్త చైర్మన్ ఎన్నిక జరగలేదు. వైస్ చైర్మన్‌లో ఒకరికి ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇవ్వనూలేదు. కౌన్సిల్ ఉండీ. అధికారులదే పాలన అన్నట్లుగా సాగుతుండటం గమనార్హం!. మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డుల్లో 30 వార్డుల్లో వైసిపి కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్‌గా చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ మొన్నటి వరకు కొనసాగారు. వైస్ చైర్మన్‌లుగా షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్‌లు కొనసాగుతున్నారు. 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ అకాల మరణంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుతం 34 మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టిడిపి నుండి 5మాత్రమే కౌన్సిలర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ప్రలోభాలకు తెరలేచింది. వైసిపిలో ఉన్న అసమ్మతిని టిడిపి అనుకూలంగా మలుచుకుంది. వైసిపిలో చైర్మన్ పదవి కోసం చిర్లంచెర్లతో పాటు డాక్టర్ కనకదుర్గ పోటీ పడ్డారు. పదవీ కాలాన్ని చెరి సగం ఒప్పందానికి చిర్లంచెర్ల తిలోదకాలు ఇచ్చారు. 4వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్న డాక్టర్ చెప్పల్లి కనకదుర్గకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇస్తామని హామీ ఇచ్చిన వైసిపి పెద్దలు ఓ విధంగా మోసం చేశారు. వైసిపి కౌన్సిలర్లలో కొందరు డాక్టర్ కనకదుర్గకు అవకాశం ఇవ్వలేదని, అందుకు కారణం చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ ముందుగా అనుకున్నల ఒప్పందం ప్రకారం దిగకపోవడమనే ఆక్రోసం ఉంది. చిర్లంచెర్ల



మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

వ్యవహారశైలి నచ్చక మరి కొందరు కౌన్సిలర్లలోనూ అసమ్మతి పెరిగింది. మొత్తానికి చిర్లంచెర్లను పదవీచ్యుతుడిని చేయాలనే సంకల్పాన్ని టిడిపి అనుకూలంగా మలుచుకుంది. వైసిపి నుండి ఏకంగా 12 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరిపోయారు. దీంతో టిడిపికి ఐదుగురు సభ్యులతో పాటు మరో 12 మందితో కలుపుకుని 17కు బలం పెరిగింది. అవిశ్వాసానికి మరి కొందరి సభ్యుల అవసరం కాగా వైసిపిలో కొనసాగుతూనే మరో ఏడుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. దీందో జూన్ 11న అవిశ్వాసం నెగ్గింది. చిర్లంచెర్ల పదవి కోల్పోయాడు. అన్నీ సక్రమంగా జరిగిపోతే ఈ పాటికే టిడిపి నుండి వక్కలగడ్డ రమ్యస్వాతి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఉండాల్సింది. అవిశ్వాసం నెగ్గి 3నెలలు దాటుతున్నా చైర్మన్ ఎన్నిక నిర్వహించలేదు. అలాగని మున్సిపల్ వైస్ చైర్మన్‌లలో ఎవరో ఒకరికి ఇన్‌చార్జి చైర్మన్‌గా అవకాశం కల్పించలేదు. ఏప్రిల్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశం తరువాత ఇంత వరకు కౌన్సిల్ సమావేశం అంటూ జరగలేదు. సాధారణంగా మూడు మాసాల్లో ఒక్కసారైనా సమావేశం జరగకపోతే కౌన్సిల్ రద్దయ్యే అవకాశం ఉందని చట్టం చెబుతోంది. ఇక్కడ నాలుగు నెలలు గడిచి ఐదో నెల సగం జరిగినా సమావేశాలు నిర్వహించలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు తరుము కొస్తున్న నేపథ్యంలో మరో వారంలో చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫిషన్ వస్తే వచ్చినట్లు. లేకుంటే ఇక లేనట్లేనని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి!



విద్యుత్ వైరుపై ప్రమాదకరంగా ఉన్న సపోర్ట్ స్తంభం

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విద్యుత్తు స్థంభాలు పక్కకు ఒరిగి పోకుండా ఏర్పాటు చేసే సపోర్టు స్తంభంకు ఇనుప యంగ్లేర్ బిగించకపోవడంతో ఆస్తంభం కాస్త జారిపోయి విద్యుత్తు వైరుపై పడి ప్రమాద భరితంగా మారింది. మండలంలోని ఐలవరం దళితవాడ సమీపంలో బాడవ పొలాలకు వెళ్లే డొంక రోడ్డులోని ఈ స్తంభంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నాలుగు నెలల క్రితం ఐలవరంకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కొరకు నూతనంగా స్థంభాలు ఏర్పాటు చేసి వైర్లు బిగించారు. ఆ సమయంలో స్థంభానికి సపోర్టుగా మరొక స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అది జారీ కింద పడకుండా ఇనుప యంగ్లేర్ తగిలించటం మరిచారు. ఇటీవల అధిక వర్షాలు, ఈదురు గాలులకు సపోర్టుగా ఉంచిన స్థంభం జారిపోయి విద్యుత్ వైరుపై పడి ఏ సమయంలోనైనా జారిపోయేందుకు సిద్ధంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలు తోపాటు నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. విద్యుత్తు వైరుపై ఉన్న ఈ సపోర్టు స్తంభం ప్రజలు సంరించే సమయంలో జారిపడితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు ఎలాంటి ప్రమాదం జరగక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



మోకాలు లోతు లో జండా చెట్టు బజారు

పర్చూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరు చుట్టుపక్కల ఎడతెరిపి లేకుండా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు వర్షం కురవడంతో డ్రైన్లు పొంగిపోయాయి. ప్రధాన రోడ్లు అన్నీ వర్షం నీటితో జలమయ్యాయి. ఎండిఓ, పంచాయతీ కార్యాలయాలరోడ్లలో డ్రైన్లు పొంగిపొర్లాయి. రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో విద్యార్థులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పర్చూరు, చీరాల ఆర్ అండ్ బి రోడ్డులోని సినిమా హాల్ సెంటర్లో రోడ్డు పూర్తిగా జలమైనది. మోకాలు లోతు నీరు ప్రవహించింది. స్థానిక రామాలయం నుండి బొమ్మల సెంటర్ వరకు ప్రధాన డ్రైను పొంగిపొర్లింది. జడ్పీ స్కూల్లో వద్ద మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి మసీదు వైపు ఉన్న మురుగు నీటి కాలువ వైపు నీరు ప్రవహించింది. మసీద్ సెంటర్ నుండి జండా చెట్టు బజార్‌లో మురుగు నీరు ప్రవహించడంతో ప్రజలు రాకపోకులకు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ కూడా మోకాలు లోతు ప్రవహించింది. జడ్పీ స్కూల్ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నదని గ్రామస్తులు అంటున్నారు. జడ్పీ స్కూల్ రోడ్డు గతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు ఎత్తుగా నిర్మాణం చేస్తున్నారని, నీరు ప్రవాహం జరగదని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీనివల్ల జండా చెట్టు బజారు ముంపు గురవుతున్నదని ప్రజల విమర్శిస్తున్నారు. బొమ్మల సెంటర్ మీదుగా వచ్చే మురుగు నీరు రామాలయం ప్రాంతం నుండి వచ్చే మురుగు నీరు ముందుకు ప్రవహించకుండా రోడ్డుపై ప్రవహిస్తూ ఉంది. డ్రైన్లలో మురుగు నీరు పారుదల సరిగా లేదని గుర్తించి వాటిని బాగు చేయాలని కోరుతున్నారు. మురుగు నీరు కాలువ లేని చోట కాలువ నిర్మాణం చేపట్టి మురుగు నీరు సరిగా ప్రవహించేటట్లు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న సిపిఎం నాయకులు

కెల్లంపల్లి పట్టా భూముల సమస్యను పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

కెల్లంపల్లి పట్టా భూముల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు సిపిఎం నేతలు వినతిపత్రం అందజేశారు. ముండ్లమూరు మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను బుధవారం సిపిఎం నాయకులు కలిశారు. సిపిఎం నేతలు మాట్లాడుతూ కెల్లంపల్లిలో అడవి పోరంబోకును 1990లో అప్పటి కలెక్టర్ ఆదేశాలతో తాసిల్దార్ విజయరావు ద్వారా 7 మందికి పట్టాలిచ్చారని, ఆ పట్టాలను అడ్డుపెట్టుకొని 12 పేర్లుతో డీకే రిజిస్టర్లో పేర్లు నమోదు కాకపోయినా అక్రమ ఆన్లైన్ చేయించుకొని వాస్తవ పట్టాదారులను భూమిలోనికి రానివ్వకుండా వల్లపు శంకర్, చక్రవర్తి, వెంకటకృష్ణ అడ్డుకుంటున్నారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకొని తమ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. వల్లపు మహాలింగం పేరుతో ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాలు తీసుకొని ఆయన భార్య అంజమ్మను భూమిలోనికి రానివ్వకుండా అడ్డుకుంటున్న శంకర్, చక్రవర్తిలపై కఠినమైన చర్యలు తీసుకొని.. వన్ బి ఆన్లైన్ తొలగించాల్సిందిగా సిపిఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, హనుమంతరావు, ఏడుకొండలు, సత్యనారాయణ, వల్లెపు నాగరాజు, రవి, నరసింహ, అంజమ్మ కలెక్టర్‌కి అర్జీ ఇచ్చారు. విచారించి న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పారు. బ్లాక్ బర్లీ పొగాకుకు సంబంధించి 18 మంది రైతుల దగ్గర మాత్రమే కొనుగోలు చేసి 23 మంది రైతులను నమోదు చేసుకోలేదని, ఉన్న రైతుల దగ్గర పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను సిపిఎం నాయకులు కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగుల రిజిస్ట్రేషన్ రికార్డ్సును, క్యాజువాలిటి రూములను, మెడిసన్ స్టోరేజి విభాగాలను, ల్యాబ్ తదితర విభాగాలను సందర్శించి.. సంబందిత రిజిస్టర్స్ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిపిఓ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఆసుపత్రి వైద్యులు డా. సుస్మిత, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ప్రత్యేకంగా వేసిన ముగ్గు

కనిగిరిలో 'సూపర్ సిక్స్' విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో సూపర్ 6- సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం బుధవారం వినూత్నంగా నిర్వహించారు. అమరావతి గ్రౌండ్స్ లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు సూపర్ సిక్స్ విజయవంతంపై సంబరాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ముగ్గుతో భారీ సూపర్ సిక్స్ సింబల్ వేసి..మిఠాయిలు పంచుకున్నారు.

ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లపై

సమగ్ర విచారణ జరపాలి

- నకిలీ సర్టిఫికెట్స్ ఉన్న వారిపై చర్యలు తీసుకోండి
- జేసీకి డివైఎఫ్ఐ వినతి



జేసీకి అర్జీ ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిఎస్‌సి 2025లో ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ జరపాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను డివైఎఫ్ఐ జిల్లా నేతలు కోరారు. నకిలీ సర్టిఫికెట్ల ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్థానిక జెసి ఛాంబర్‌లో బుధవారం సంయుక్త కలెక్టర్‌ను డివైఎఫ్ఐ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె ఎఫ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో ఈడబ్ల్యుసి కోటాలో ఎంపికైన అభ్యర్థులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలన్నారు ఈడబ్ల్యుఎస్ కోటలో ఎవరైతే ఎంపికైన వారు ఉన్నారో వారి ప్రస్తుత అభ్యర్థి ఉన్నారో వివాహమైన మహిళ అయితే భర్త ఆదాయ ధృవీకరణ పత్రం సర్టిఫికెట్, పురుషులైతే వారి లేటెస్ట్ సర్టిఫికెట్స్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్నారు స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్ సబ్జెక్టుకు ఎంపికైన వాళ్ళలో కొంతమంది భూములున్నా, పెళ్లిళ్లు అయిన తర్వాత భర్తలకు సొంత కంపెనీలు, ఆస్తులు ఉన్నప్పటికీ ఈడబ్ల్యుఎస్ తెచ్చుకుని ఉద్యోగానికి ఎంపిక ఆయ్యారన్నారు. ఇటువంటి వారి సర్టిఫికెట్ సమగ్ర విచారణ జరపాలని, ఎవరైతే నకిలీ సర్టిఫికెట్స్ అందజేశారో అటువంటి వారిని, అనర్హులను తొలగించి అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అర్హులైన వారికి టీచర్ పోస్టులు ఇవ్వాలన్నారు. నేడు భర్తీ చేస్తున్న టీచర్ పోస్టులలో ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా నిజమైన అర్హులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని కోరారు. స్పందించిన జెసి ఆర్.గోపాలకృష్ణ ఇటువంటు నకిలీ సర్టిఫికెట్స్ అందజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పి..నరేంద్ర, పి.రాంబాబు, జి.శ్రీనివాసులు, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ పర్యటనకు

పటిష్ట బందోబస్తు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు.బందోబస్తు విధుల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ, సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాపట్ల జిల్లా అడివిపాలెం పంచాయతీ పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో, బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి నగరవనంలో బుధవారం జిల్లా ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ప్రదేశాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హెలిప్యాడ్, కాన్వాయ్, రోప్ పార్టీలు, చెకింగ్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశాలు, తాటి మొక్క నాటే ప్రదేశం, నగరవనంలోని అమరవీరుల స్మారక స్థూపం, అమరవీరుల కుటుంబాలతో సమావేశం జరిగే ప్రదేశం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. అందరూ సమయపాలన పాటిస్తూ, కేటాయించిన ప్రదేశాల్లో సంయమనంతో, సమర్ధవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినపుడు వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకురావాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఏడీ వెంకట్రమణ

సమాచార శాఖ ఏడీగా వెంకట్రమణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.వెంకట్రమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో డిపిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకట్రమణకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి బాపట్ల జిల్లాకు నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులు జారీచేయడం జరిగింది. బాధ్యతలు చేపట్టిన ఎడి జిల్లా కలెక్టర్ జె వెంకటమురళిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగింది. బాపట్ల జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి జిల్లాలో చేపట్టిన సేవా కార్యక్రమాలపై సంస్థ జిల్లా చైర్మన్ బిఎస్.నారాయణ బట్టు నివేదికలను సమర్పించారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా విశేష సేవలు అందించిన 18 మంది సభ్యులకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు, జ్ఞాపికలను అందించారు. నూతన పాలక మండలి ఎన్నికలు జరగ్గా 11 మంది పాలకవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్ గా బి.ఎస్ నారాయణ బట్టు మరోసారి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బి.రామసుబ్బారావు, కోశాధికారిగా టి ప్రసాదరెడ్డి ఎన్నిక కాగా మరో తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. కృష్ణానది వరద విపత్తు సమయంలో రెడ్ క్రాస్ అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ చెప్పారు. నిరాశ్రయులైన 30 వేల మందికి పది రోజులపాటు నిరంతరం భోజన, ఆహార పదార్థాలు, వైద్యం అందించే క్రమంలో రెడ్ క్రాస్ సేవలు మరువలేనివన్నారు. వారందించిన సేవలతో బాపట్ల జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకునేలా రెడ్ క్రాస్ సంస్థ కషి చేసిందన్నారు. జిల్లా మారుమూల ప్రాంతాల నుంచి గ్రీవెన్స్ సెల్ కు వచ్చే నిరు పేదలైన అభాగ్యులకు భోజనం వండి ఉచితంగా పంపిణీ చేశారన్నారు. తదుపరి భోజనాలకు అయ్యే ఖర్చులో కలెక్టరేట్ నుంచి కొంత సహకారం అందిస్తున్నామని వివరించారు. ఏడాది నుంచి ఉచిత భోజనం అందిస్తున్న విధానాన్ని స్ఫూర్తిగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. గర్భిణులకు కిట్లు, రక్తదానం చేయడంలో ముందు ఉంటుందన్నారు.



రెడ్‌క్రాస్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ఇలాంటి నిస్వార్ధ సేవలకు రెడ్ క్రాస్ సంస్థ నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందన్నారు. నూతన పాలకవర్గం స్ఫూర్తితో పని చేయాలన్నారు. సమాజంలో దుర్భరమైన జీవనం సాగిస్తున్న మూడువేల మంది యానాదులకు ఆధార్ కార్డులు ఇచ్చామని, మిగిలిపోయిన వారిని గుర్తించేందుకు సహకరించాలన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మంచి సేవలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. రాజకీయ ప్రస్థానం ముగిసిన తర్వాత జీవితకాలం రెడ్ క్రాస్ లో పనిచేస్తానని ప్రకటించారు. సమాజంలోని సమస్యలను పరిష్కారానికి వేదికగా రెడ్ క్రాస్ నిలిచిందని రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు తెలిపారు. నిజాయితీగా పనిచేసే అవకాశం రెడ్ క్రాస్ ద్వారానే సాధ్యమన్నారు. బాపట్ల జిల్లాలో అధ్యక్షుడిగా ఉన్న కలెక్టర్ సహకారంతో సేవలు మరింత విస్తతమయ్యాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ బి.ఎస్ నారాయణ బట్టు, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.